పిపిపి విధానంలో పర్యాటకాభివృద్ధి

- నూతన టూరిజం పాలసీ అమలుకు చర్యలు
- జిల్లాలో ఐదు ప్రాంతాల అభివృద్ధి
- ప్రజాశక్తితో పర్యాటక శాఖ అధికారిణి పి.విజయ

ప్రజాశక్తి-కర్నూలు జిల్లా పరిషత్

పబ్లిక్ ప్రయివేట్ పార్ట్నర్‌షిప్ (పిపిపి) విధానంలో జిల్లాలో పర్యాటకాన్ని అభివృద్ధి చేయనున్నట్లు జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ అధికారిణి పి.విజయ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల నూతన టూరిజం పాలసీని విడుదల చేసిందని, ఆ పాలసీని జిల్లాలో అమలు చేసేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నూతన టూరిజం పాలసీ ప్రకారం జిల్లాలో ఐదు ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నట్లు వివరించారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...

నూతన టూరిజం పాలసీ గురించి తెలపండి..?

అధికారిణి : రానున్న ఐదేళ్ల (2024–29) ఏపీ టూరిజం పాలసీని రాష్ట్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసింది. రాష్ట్ర ఆర్థిక వృద్ధి, ఉపాధి కల్పన అంశాలే లక్ష్యంగా నూతన టూరిజం పాలసీని అమల్లోకి తెస్తున్నట్లు తెలిపింది. ఎపి పర్యాటక ప్రాజెక్టులకు సంబంధించి మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా నూతన పాలసీ ఉంది. ఎకో టూరిజం, క్రూయిజ్ టూరిజం, బీచ్ సర్క్యూట్లు, బ్యాక్ వాటర్ టూరిజాన్ని ప్రోత్సహించేందుకు నూతన పాలసీ అనువుగా ఉంటుందని ప్రభుత్వం తెలిపింది. ఈ రంగాల్లో పెట్టుబడులను ప్రోత్సహించేందుకు పర్యాటక పాలసీ ఉంటుందని తెలిపింది. పర్యాటక ప్రాజెక్టులకు పారిశ్రామిక హోదా కల్పించడం, పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేయడం, విదేశీ టూరిస్టులను ఆకర్షించేందుకు నూతన పాలసీని రూపొందించింది. రాష్ట్రంలో పర్యాటకాభివృద్ధి, ఆర్థిక పురోభివృద్ధికి ప్రోత్సాహం, ఉద్యోగాల కల్పన, సాంస్కృతిక మార్పిడి సులభతరం చేసేలా పాలసీ రూపకల్పన చేశారు. రాష్ట్ర గ్రాస్ వ్యాల్యూ యాడెడ్ (జీవీఏ)లో పర్యాటక రంగం వాటా 4.6 శాతం నుంచి 8 శాతానికి పెంచడంతో 20 శాతం పైబడి జీవీఏను కంట్రిబ్యూట్ చేయాలన్నది ప్రభుత్వ యోచన. పర్యాటక రంగంలో ఉపాధి అవకాశాలను 12 శాతం నుంచి 15 శాతానికి పెంపొందించాలని నిర్ణయించారు. అంతర్జాతీయ పర్యాటకులను ఆకర్షించడం, విదేశీ పర్యాటకుల రాకలో టాప్ 10 రాష్ట్రాల్లో ఒకటిగా ఏపీని చేర్చేలా పర్యాటక పాలసీని రూపొందించారు.

నూతన పాలసీ వలన లాభాలు ఏమిటి..?

అధికారిణి : నూతన టూరిజం పాలసీ వల్ల విద్యుత్ చార్జీలు తక్కువ ఉంటాయి. ప్రాపర్టీ టాక్స్‌లు కూడా తక్కువగా ఉంటాయి. ఉచిత రుణాలు, తక్కువ వడ్డీ రుణాలు ఇస్తారు. నూతన టూరిజం పాలసీ ప్రకారం ఇన్వెస్టర్లకు రెండు రకాల సబ్సిడీలు ఇస్తారు. వన్ టైం సబ్సిడీ, మల్టీ టైమ్స్ సబ్సిడీ ఉంటాయి. వన్ టైం సబ్సిడీ 4 రకాలుగా ఉంటుంది. స్టాంప్ డ్యూటీ ఉండదు. ఇది అన్ని రకాల టూరిజం ప్రాజెక్టులకుఅమలవుతుంది.

పాలసీలో ఎన్ని రకాల ప్రాజెక్టులు ఉంటాయి..?

అధికారిణి : నూతన టూరిజం పాలసీలో 5 రకాల ప్రాజెక్టులు ఉంటాయి. రూ.కోటి వరకూ పెట్టుబడి పెట్టడం కోసం మైక్రో ప్రాజెక్టులు, రూ.10 కోట్ల వరకూ పెట్టుబడి పెట్టడం కోసం స్మాల్ ప్రాజెక్టులు, రూ.10 నుంచి రూ.75 కోట్ల వరకు పెట్టుబడి పెట్టడం కోసం మీడియం ప్రాజెక్టులు ఉంటాయి. వాటితో పాటు రూ.75 కోట్ల పైన పెట్టుబడికి లార్జ్ ప్రాజెక్టులు, రూ.400 కోట్ల పైన పెట్టుబడికి మెగా ప్రాజెక్టులు ఉంటాయి. వీటన్నిటికీ వంద శాతం స్టాంప్ డ్యూటీ రాయితీ ఉంటుంది. ల్యాండ్ కన్వర్షన్ ఛార్జీలలో వంద శాతం రాయితీలు ఇస్తారు. పరిశ్రమలకు ఇచ్చే విధంగా విద్యుత్ అందిస్తారు. ఏడేళ్ల వరకూ ఎస్‌జిఎస్‌టిలో వంద శాతం రాయితీ ఉంటుంది.

కొత్త పాలసీలో భాగంగా జిల్లాలో ఏయే ప్రాంతాలను అభివృద్ధి చేయనున్నారు..?

అధికారిణి : నూతన టూరిజం పాలసీలో భాగంగా ఆదోని మండలం పెద్ద తుంబలం, రాంజల చెరువు, ఎమ్మిగనూరు మండలం బనవాసి, తుగ్గలి మండలం ఎర్రగుడి, గోనేగండ్ల మండలం గాజులదిన్నెలను పర్యాటకంగా అభివృద్ధి చేయనున్నాం. వాటి కోసం మొత్తం రూ.14 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసి జిల్లా కలెక్టర్ ద్వారా ప్రభుత్వానికి పంపాం. నిధులు విడుదల కావాల్సి ఉంది.

ఆయా ప్రాంతాల్లో ఎలాంటి వసతులు కల్పించనున్నారు..?

అధికారిణి : ఆదోని మండలం పెద్ద తుంబలం గ్రామం వద్ద రూ.6 కోట్లతో టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, రెస్టారెంట్, అకమోడేషన్, చిల్డ్రన్ ప్లే పార్క్ ఏర్పాటు చేయనున్నాం. ఆదోని మండలం రాంజల చెరువు వద్ద రూ.3 కోట్లతో బోటింగ్ యాక్టివిటీ, రెస్టారెంట్, చిల్డ్రన్ ప్లే పార్క్ ఏర్పాటు చేయనున్నాం. .ఎమ్మిగనూరు మండలం బనవాసి వద్ద రూ.కోటితో ఫుడ్ కోర్టు, మరుగుదొడ్లు నిర్మించనున్నాం. తుగ్గలి మండలం ఎర్రగుడి అశోకుని శిలాశాసనాల వద్ద రూ.కోటితో టూరిస్ట్ ఇన్ఫర్మేషన్ సెంటర్, రెస్టారెంట్, డార్మిటరీస్ నిర్మించనున్నాం. గోనేగండ్ల మండలం గాజులదిన్నె ప్రాజెక్టు వద్ద రూ.మూడు కోట్లతో బోటింగ్, రెస్టారెంట్, చిల్డ్రన్ ప్లే పార్క్ ఏర్పాటు చేయనున్నాం. పబ్లిక్ ప్రయివేట్ పార్ట్నర్‌షిప్ (పిపిపి) విధానంలో వాటిని అభివృద్ధి చేయనున్నాం.

ప్రాజెక్టులపై పాలకుల నిర్లక్ష్యం...

- ప్రభుత్వాలను నిలదీయాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎం.ఎ.గఫూర్
- 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి - ప్రత్యామ్నాయ విధానాలు'పై రాష్ట్ర సదస్సు
- తెలకపల్లి నరసింహయ్యకు నివాళులు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేయడంలో పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, ఆ అన్యాయానికి వ్యతిరేకంగా గళమెత్తేలా ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పేర్కొన్నారు. సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ, తెలకపల్లి నరసింహయ్య ఆరో వర్ధంతి సందర్భంగా కర్నూలు లలిత కళా సమితిలో ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ అధ్యక్షతన 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి–ప్రత్యామ్నాయ విధానాలు'పై రాష్ట్ర సదస్సు నిర్వహించారు. ముందుగా తెలకపల్లి నరసింహయ్య విగ్రహానికి వక్తలు, అతిథులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ మాట్లాడారు. ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పార్టీ కోసమే నరసింహయ్య పని చేశారని తెలిపారు. తెలంగాణతో పాటు రాయలసీమ కూడా వెనకబడిందని శ్రీకృష్ణ కమిటీ చెప్పిందని, వెనకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయాలనే ఇంకిత జ్ఞానం పాలకులకు లేదా అని ప్రశ్నించారు. గోదావరి నీళ్లు బనకచర్లకు తీసుకురావాలంటే 300 అడుగుల పైకి నీళ్లు తీసుకురావాలని, చంద్రబాబు మతి తప్పుతున్నారని అన్నారు. రాష్ట్ర విభజన తరువాత తొలి స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో కర్నూలు జిల్లాలో ప్రాజెక్టులు పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ అమలు చేయలేదని, రాయలసీమ వాసి అయిన జగన్ సిఎం అయినా సీమ అవసరాలు ఎలా తీర్చాలని ఒక్క క్షణం కూడా ఆలోచించలేదని తెలిపారు. ఉన్న ప్రాజెక్టులకు పంట కాలువలు నిర్మిస్తేనే ఉపయోగం ఉంటుందన్నారు. కర్నూలు జిల్లాలో పనులు కల్పించి వలసలు నివారించే అజెండా ప్రభుత్వానికి లేదన్నారు. వెనకబడిన ప్రాంతాల ప్రజలకు ఉపాధి, తిండి, చదువు, రవాణా లేవని, ఆ సమస్యలపై ప్రజల్లోకి వెళ్ల ప్రభుత్వాలను నిలదీయాలని కోరారు. రాయలసీమ డిక్లరేషన్ అన్న బిజెపి నాయకులు దాన్ని ఎందుకు అమలు చేయరని, ఎందుకు నిధులు ఖర్చు పెట్టరని అన్నారు. ప్రజల హక్కుల కోసం ప్రజా పోరాటాలు నిర్మించి కలిసొచ్చే అందరినీ కలుపుకుని ఉద్యమాలు నిర్మించాలని పిలుపునిచ్చారు.

కార్పొరేట్ అభివృద్ధి తప్ప కామన్ మ్యాన్ అభివృద్ధి లేదు

- ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి

కార్పొరేట్ అభివృద్ధి తప్ప కామన్ మ్యాన్ అభివృద్ధి లేదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి తెలిపారు. ఆయన మాట్లాడుతూ ప్రజలను అభివృద్ధి చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఎపి అభివృద్ధి లోకేష్, పవన్ అభివృద్ధిగా మారుతోందన్నారు. అందరూ ఒప్పుకున్న హైకోర్టును కర్నూలులో ఎందుకు పెట్టలేదన్నారు. కార్పొరేట్ అభివృద్ధి తప్ప కామన్ మ్యాన్ అభివృద్ధి లేదని ఎద్దేవా చేశారు. అమరావతిని రాజధానిగా ప్రకటించినప్పుడు ప్రాంతాల వారీగా ప్రకటించిన ప్రణాళిక ఊసే లేదన్నారు. రోడ్ల అభివృద్ధి పేరుతో టోల్ బాదుడు వేస్తే ఎవరు అభివృద్ధి చెందుతారన్నారు. రోడ్లు, ఆస్పత్రులు, డ్యాములు ప్రయివేటు పరం అయిపోతున్నాయన్నారు. చిరుద్యోగులను, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను ఇంటికి పంపి అభివృద్ధి ఏం చేస్తారని ప్రశ్నించారు. గతంలో విజన్ 2020ను వ్యతిరేకించిన స్ఫూర్తితో విజన్ 2047ను కూడా వ్యతిరేకించాలన్నారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి దిశగా మేధావుల సలహాలతో సమగ్రాభివృద్ధి కోసం ముందుకెళ్లాలన్నారు.



మాట్లాడుతున్న తెలకపల్లి రవి, డాక్టర్ గేయానంద్

ప్రజావ్యతిరేకంగా విజన్ 2047

- మాజీ ఎమ్మెల్సీ గేయానంద్

మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ వైద్య కళాశాలలో ఎస్ఎఫ్ఐలో పనిచేస్తున్నప్పుడు నరసింహయ్య, గఫూర్, షడ్రక్ విప్లవాల గురించి తెలియజేశారన్నారు. పైపై కార్యక్రమంగా, ప్రజలకు వ్యతిరేకమైన విధంగా విజన్ 2047 ఉందని తెలిపారు. వెనకబడిన ప్రాంతాల గురించి, నీటి ప్రాజెక్టుల గురించి, ప్రభుత్వ ఆస్పత్రుల గురించి కనీస ప్రస్తావన లేదన్నారు. ఉద్యోగాలు రాని అభివృద్ధిని తీసుకొస్తున్నారన్నారు. రాయలసీమ ప్రకృతి వనరులను కార్పొరేట్ చేతుల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు. అందరినీ కలుపుకుని అభివృద్ధి కోసం ఉద్యమించాలని కోరారు.

ఐక్య ఉద్యమాలు అవసరం

- సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి నల్లప్ప

పాలకులు విద్యా, వైద్యం వైపు దష్టి పెట్టడం లేదని వాటి సాధన కోసం ఐక్యంగా ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందని సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప తెలిపారు. వ్యవసాయ పారిశ్రామిక విద్యా, వైద్య రంగాలు అభివృద్ధి చెందినప్పుడే జిల్లా అభివృద్ధి చెందుతుందన్నారు. పాలకులు సాగునీటి గురించి పట్టించుకోకపోవడమే. వర్షపు నీరు సముద్రం పాలవుతున్నా ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. 64 రకాల ఖనిజ సంపద రాయలసీమలో ఉన్నా ఉపాధి, పారిశ్రామిక రంగం లేక ఉపాధి కోసం బెంగళూరుకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉందన్నారు.

నరసింహయ్య బాటలో నడవాలి

- తెలకపల్లి హరి

కమ్యూనిస్టులందరూ నరసింహయ్య బాటలో నడవాలని, ఆ మేరకు ప్రతిజ్ఞ తీసుకోవాలని తెలకపల్లి నరసింహయ్య కుమారుడు తెలకపల్లి హరి తెలిపారు. తమ తల్లిదండ్రులు చూపిన బాటలో ముందుకు వెళుతున్నామన్నారు. విద్యార్థులు, యువకులతో కలిసి పోరాట బాట సాగించాలన్నారు. ఏ ప్రాంతం నుండి సమస్యలు వచ్చినా నరసింహయ్య వారికి సరైన పరిష్కారం చూపేవారన్నారు. మదనపల్లి వైద్య కళాశాలను ప్రయివేటు పరం చేయాలని చూస్తున్నారని, దానికి వ్యతిరేకంగా నిరహారదీక్షలు చేయనున్నామని తెలిపారు.

ఆలోచింపజేసిన విప్లవ గేయాలు

సదస్సు సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు తెలకపల్లి నరసింహయ్య, రాష్ట్ర సమగ్రాభివృద్ధిపై పాడిన పాటలు ఆలోచింపచేశాయి. ఉద్యమాల తోటలో పేదోళ్ల జాబిల్లి.., పరిశ్రమలకై పోరును చేద్దాం ఒక్కటిగా.., ఎర్రజెండా ఎర్రఎర్రని జెండా., చలో చలో రే చలో నెల్లూరుకు చలో చలో..అంటూ గేయాలను ఆలపించారు. ప్రజానాట్యమండలి కళాకారులు రాజు, లోకేష్, బతుకన్న, సుబ్బరాయుడు, రాంబాబు, లక్ష్మి, సరిత ఉన్నారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి

- కలెక్టరేట్ ఎదుట రైతు, కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని కార్మిక రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం కలెక్టరేట్ ఎదుట కార్మిక కర్షక ఐక్యత దినం సందర్భంగా సిఐటియు, రైతు, వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ నిరసనలో సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, వ్యకాస జిల్లా కార్యదర్శి నారాయణ, సిఐటియు న్యూ సిటీ కార్యదర్శి సిహెచ్.సాయిబాబా మాట్లాడుతూ... మైత్రి బలపడవలసిన అవసరం ఉందన్నారు. ఎందుకంటే నరేంద్ర మోడీ ప్రభుత్వం ఏ వర్గం ప్రజానీకాన్ని వదలడం లేదన్నారు. కార్మిక వర్గం శతాబ్ద సంవత్సరాల క్రితం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను మార్చి నాలుగు కోడ్‌లుగా చేసి కార్మిక వర్గాన్ని కట్టుబానిసలుగా మార్చడానికి పూనుకున్నారన్నారు. గతంలో మోడి ప్రభుత్వ మెడలు వంచి సాధించుకున్న వాటిని తుంగలోకి తొక్కడం, ఆ రోజు చెప్పిన రైతు పండించిన పంటకు మద్దతు ధర కోసం చట్టం చేయకపోవడంతో వాటిని చేయాలని రైతాంగం ఆందోళన చేస్తున్నారన్నారు. మరొకపక్క దల్లేవాలా అనే రైతు 55 రోజులుగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్నారని, ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందన్నారు. మా సమస్యలు పరిష్కరించండని మరో 111మంది మూడు రోజులుగా నిరవధిక దీక్షలు కూర్చున్నారన్నారు. పాలకులకు చీమ కుట్టినట్లు కూడా లేదన్నారు. మోడి ప్రజావ్యతిరేక విధానాల పై కార్మిక, కర్షకులు ఇతర ప్రజా తంత్ర లౌకిక శక్తులను మిలిటెంట్ ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉండాలన్నారు. సిఐటియు నగర అధ్యక్షులు అబ్దుల్ దేశాయ్, సిఐటియు జిల్లా నాయకులు నాగేశ్వరరావు, కె.ప్రభాకర్, సిఐటియు నగర నాయకులు కె. సుధాకరప్ప జి.ఏసు, మెడికల్ రిప్రజెంట్స్ యూనియన్ జిల్లా నాయకులు కోటేశ్వరరావు, ఆటో యూనియన్ నాయకులు మహమూద్, హుస్సేన్‌వలి, షంషేర్, సిఐటియు నాయకులు చలపతి , ఆటో హమాలీ కార్మికులు, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద నిరసన చేపడుతున్న నాయకులు

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న విసి సాయిగోపాల్

లోతైన భావోద్వేగాల సంగమమే మీరా కథలు

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

వర్తమాన జీవితంలో ఎదుర్కొంటున్న ప్రతిమనిషి ఎదుర్కొంటున్న సమస్యల్ని ఇతివృత్తాలుగా తీసుకుని కథలు రాస్తారని, కథల్లోని ఆర్ద్రత, భావోద్వేగాల సంగమమే మీరా కథలని క్లస్టర్ యూనివర్శిటీ ఉపకులపతి ఆచార్య డివిఆర్ సాయి గోపాల్ అన్నారు. సుదీర్ఘమైన సాహిత్య జీవితాన్ని కలిగి వుండటమే కాక వేలాదిమంది విద్యార్థులను తీర్చిదిద్దిన గొప్ప కథకులు, ఆధ్యాపకురాలు డాక్టర్ మీరా సుబ్రహ్మణ్యం అని అన్నారు. కర్నూలు పింగళి సూరన్న తెలుగు తోటలో ఆదివారం సాయంత్రం డాక్టర్ మీరా సుబ్రహ్మణ్యం రచించిన రెండు పుస్తకాలను ఆయన ఆవిష్కరించారు. నరసం అధ్యక్షురాలు కావ్యం సుబ్బలక్ష్మి సభాధ్యక్షత సభ నిర్వహించారు. చీకటిలో, వేకువలో అనే కథా సంపుటి ..ది కేజ్ అనే ఆంగ్ల రచనను డాక్టర్ ఫరీదా, డాక్టర్ చంద్రమౌళినిలు సమీక్షించారు. సమాజ హితవు కుటుంబాల్లో ఉండ వలసిన బాంధవ్యాలు, వైవిధ్య భరితమైన జీవితాన్ని జీవన సారాన్నంత తమ కథల్లోకి ఒలకించిన సామాజిక ప్రేమికురాలు చక్కటి కథ రచయిత్రిగా పేరుపొందారని విశ్లేషించారు. కాలానుగునమైన కథలను మహిళా సాధికారతకు సంబంధించిన కథలను హృద్యంగా ఉత్కంఠభరితంగా రాశారు. అందమైన భాషలో పొదిగి కథలుగా పాఠకులకు అందిస్తారని, అలాంటి కథలే చీకటిలో వేకువలో అలాగే ది కేజ్ కథల సంపుటిలో ఉన్నాయన్నారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర మాట్లాడుతూ 1963లో కథా ప్రపంచంలోనే ఆధునిక కథాప్రపంచంలోకి అడుగుపెట్టారని అన్నారు. టిఎస్ఎ. కృష్ణమూర్తి ప్రసిద్ధ నవలా రచయిత వంటి వారు ప్రశంసలను పొందిన మీరా కథలు గుండెను తట్టి లేపే విధంగా ఆలోచనత్మకంగా సాగుతాయన్నారు. ప్రముఖకథారచయిత డాక్టర్ హరికిషన్ మాట్లాడుతూ చాలా చక్కటి శైలిలో వాస్తవ జీవితాన్ని ఆనందమయం చేసుకోవడంలో పరిస్థితులను అవగాహన చేసుకోవాల్సిన విధానాన్ని రచయిత్రి కథలలో చక్కగా వివరించారన్నారు. సదస్సును డాక్టర్ దండేబోయిన పార్వతిదేవి సమన్వయం చేశారు. తెలుగుభాషా వికాస ఉద్యమం రాష్ట్రకార్యదర్శి జెఎస్ఆర్‌కె శర్మ ఆత్మీయసందేశం ఇచ్చారు. సభలో కవులు జంధ్యాల రఘుబాబు, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, ఎస్‌డివి అజీజ్, రేవుల శ్రీనివాసులు, లక్ష్మయ్య, శ్రీధర్ మూర్తి సాహిత్యాభిమానులు రచయిత్రి శిష్యులు సహోపాధ్యాయులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 23న మాలమహానాడు సభ

ప్రజాశక్తి -కోడుమూరు రూరల్

ఎస్‌సి వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి జెఎసి ఆధ్వర్యంలో ఫిబ్రవరి 23న ఎస్‌టిబిపి కాలేజీ ఆవరణలో బహిరంగ సభ ఉంటుందని మాలహానాడు నాయకులు ఆదివారం తెలిపారు. మాల సోదరులు అందరూ కలిసి సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాల మహానాడు నాయకులు మునుస్వామి, జయన్న,యాట ఓబులేసు, మద్దిలేటి, రామ్మోహన్, సురేంద్ర, రంగస్వామి, గోపాలు, శ్రీనివాసులు, మౌలాలి, కళ్యాణ్ దుర్గా సింగరయ్య, రామాంజనేయులు, దాసు కొప్పుల రాజు కొప్పుల మద్దిలేటి కొప్పుల తిక్కన్న పాల్గొన్నారు.

60 అడుగుల రోడ్డు ఎవరి కోసం?

అవసరం లేని రోడ్డును ప్రతిపాదించిన అధికారులు వివరణ ఇవ్వాలి.

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

నగరపాలక సంస్థ పరిధిలో ఐదు కాలనీల నివాస భవనాల మీదుగా మంజూరు చేసన 60 అడుగుల రోడ్డును వ్యతిరేకిస్తూ స్థానిక ప్రజలు నిరసన తెలిపారు. పట్టణ పౌర సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి మాట్లాడుతూ జనసంచారం తక్కువగా ఉన్న నివాస భవనాలపై రహస్యంగా ప్రజలకు తెలపకుండా అవసరంలేని 60 అడుగుల రోడ్డు ఎవరి కోసం మంజూరు చేశారని ప్రశ్నించారు. ఉన్న రోడ్లను కాపాడడం చేతగాని అధికారులు అవసరం లేని నివాస ప్రాంతాల్లో 60 అడుగుల రోడ్లు ఎవరికోసం ప్రతిపాదించారో అధికారులు బహిరంగంగా ప్రకటించాలని కోరారు. కూటమి ప్రభుత్వం స్పందించి అవసరంలేని 60 అడుగుల రోడ్డును రద్దు చేయాలని కోరారు. స్థానిక కాలనీల ప్రతినిధులు ఎం.వరప్రసాద్, జి. పుల్లారెడ్డి, కె.నాగేశ్వరరావు, ఎన్. రమణయ్య లు మాట్లాడారు. ప్రేమ నగర్, లక్ష్మణ సింగ్ కాలనీ, పోస్టల్ కాలనీ, కోట్ల విజయభాస్కర్ రెడ్డి నగర్, బాలాజీ నగర్ మీదుగా జాతీయ రహదారి వరకు 20 నుండి 40 అడుగుల రోడ్లు మాత్రమే ఉన్న మా కాలనీలపై ఎలా 60 అడుగుల రోడ్డు మంజూరు చేస్తారని ప్రశ్నించారు. 30 నుంచి 40 సంవత్సరాల క్రితం నిర్మించుకున్న ఇండ్లపై మా అనుమతి లేకుండా 60 అడుగుల రోడ్డును మంజూరు చేసిన విషయం తెలిసినప్పటినుండి వందలాది భవన యజమానులకు నిద్రలేని రాత్రులు గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు నిర్మించుకునేందుకు అనుమతులు, బ్యాంకులోన్లు కూడా ఇవ్వడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈ పర్యటనలో పలు కాలనీల ప్రతినిధులు రాజేశ్వర్‌రెడ్డి, రామచంద్రయ్య, మాణిక్య రెడ్డి, మహమ్మద్ యూనిస్, వెంకట్‌రెడ్డి, న్యాయవాది రవి కుమార్, అన్వర్ భాష, నయూమ్ పాల్గొన్నారు.

పిపిఎస్ఎస్ ఆధ్వర్యంలో నిరసన తెలుపుతున్న స్థానికులు

కబడ్డీలో రాణించాలి

-సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు గోవిందు

ప్రజాశక్తి - కర్నూలు జిల్లాపరిషత్

కబడ్డీలో రాణించాలని కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు గోవిందు అన్నారు. కర్నూలు డిఎస్ఎ అవుట్ డోర్ స్టేడియంలో కర్నూలు ఉమ్మడి జిల్లా కబడ్డీ ప్రధాన కార్యదర్శి శుభాకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీనియర్స్ మహిళలు, పురుషల కబడ్డీ జిల్లా జట్లను ఎంపిక కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై, కబడ్డీ క్రీడా సంఘం కోశాధికారి సురేష్, సంయుక్త కార్యదర్శి అమర్, మురళి, శీలన్న, వ్యాయామ ఉపాధ్యాయులతో కలసి క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు ఎల్లప్పుడూ నిత్య సాధనలో క్రమశిక్షణతో మెలగాలని అన్నారు. కబడ్డీ వల్ల ధైర్యసాహసాలు, మానసిక దృఢత్వం, క్రమశిక్షణ మెరుగుపడుతుందని తెలిపారు. కబడ్డీ జిల్లా కార్యదర్శి శుభాకర్ మాట్లాడుతూ ఈనెల 25, 26, 27వ తేదీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని విశాఖపట్నం జిల్లాలోని అనకాపల్లిలో ఎంపికైన క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలు పాల్గొంటారని ఆయన తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు మురళీకృష్ణ , చిన్న సుంకన్న, నాగన్న నాగరాజు క్రీడాకారులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ పంప్ సెట్ల దొంగతనం

-భయాందోళనలో రైతన్నలు

-సమాచారంతో పోలీసుల విచారణ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

కల్లూరు మండలం ఉలిందకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చెట్లమల్లాపురం గ్రామం సమీపంలో ప్రవహిస్తున్న హంద్రీనీవా కాలువపై రైతులు విద్యుత్ మోటార్‌పంప్ సెట్లు ఏర్పాటు చేసుకున్నారు. శనివారం అర్ధరాత్రి సమయంలో 12 విద్యుత్ మోటార్ పంపు సెట్లను దొంగలు ఎత్తుకెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున ఐదు గంటలకు విద్యుత్తు సరఫరా అవుతుందని తెలిసిన రైతులు మోటార్లను ఆన్ చేసేందుకు వెళ్లారు. అక్కడ మోటార్లు లేకపోవడంతో రైతులు ఆందోళన చెందారు. హంద్రీనీవా కాలువ కట్టపై పరిశీలించగా 12 మంది రైతులకు చెందిన విద్యుత్ మోటర్ పంప్ సెట్లు లేవని గుర్తించారు. వెంటనే మోటార్ల దొంగతనం జరిగిందనే విషయాన్ని ఉలిందకొండ పోలీసులకు రైతులు సమాచారాన్ని అందించారు. ఉలిందకొండ ఎస్ఐ ధనుంజయ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఐదు మంది రైతులకు చెందిన 7.5 హెచ్‌పి మోటార్లు, ఏడుగురు రైతులకు చెందిన ఫైవ్ హెచ్‌పి మోటర్లు దొంగతనానికి గురైనట్లు గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. రైతులు కె. శేఖర్ రెడ్డి వై.శ్రీనివాసులు రెడ్డి, ఎస్.శ్రవణ్ కుమార్ రెడ్డి, ఆర్.కృష్ణారెడ్డి, కె.వెంకటేశ్వర్లు కు చెందిన 7.5 హెచ్‌పి మోటార్లు, రైతులు ఎస్. గిడ్డయ్య ఎస్‌సి మునిస్వామి, డి.పురుషోత్తం రెడ్డి, వడ్డే శ్రీనివాసులు, మాదే పుల్లన్న ,కె.నాగరాజు, ఆర్.పరమేశ్వర్ రెడ్డి, 5హెచ్‌పి మోటర్లు దొంగతనానికి గురయ్యాయి. సదర్ రైతులు మొక్కజొన్న వేరుశనగ హార్టికల్చర్ పొగాకు తదితర పంటలను సాగు చేశారు. మోటార్లు దొంగతనానికి గురి కావడంతో నీటి తడులు అందక పంట పైరులు ఎండిపోయే అవకాశం ఉందని రైతులు వాపోయారు. దొంగిలించిన మోటార్ల విలువ సుమారు రూ.మూడు లక్షలు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు. పోలీసులు విచారణ చేపట్టి దొంగలను పట్టుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. గతంలో చెట్ల మల్లాపురం గ్రామంలో ఒకటి భక్తి పాడు గ్రామ పరిధిలో నాలుగు విద్యుత్ మోటార్ పంప్ సెట్లు దొంగలు ఎత్తుకెళ్లారు. ఇంకా తడగమపల్లె గ్రామ సమీపంలోని ఒక కంకర మిషన్ ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ దొంగలు ఎత్తుకెళ్లడానికి ప్రయత్నిస్తుండగా ఫ్యాక్టరీలోని కార్మికులు దొంగలను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఇన్ని సంఘటనలు జరుగుతున్నా పోలీసులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం పట్ల ఆయా గ్రామాల రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

వేమన చిత్రపటానికి నివాళ్లు అర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా, తదితరులు

గొప్ప దార్శనికుడు వేమన

జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

తెలుగు సమాజాన్ని చైతన్య పరిచిన యోగివేమన గొప్ప సంఘ సంస్కర్త, దార్శనికులని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం యోగివేమన జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ యోగివేమన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో, అత్యంత సులభంగా తేలికైన పదజాలంతో రచించిన వేమన పద్యాలు అన్ని తరాల ప్రజలు అంగీకరించడం ఆయన రచనల గొప్పతనం అన్నారు. యోగివేమన ప్రజాకవి అని, పామరులు , పండితులను అలరించిన ఆయన కవిత్వం ఎంతో గొప్పదన్నారు. సమాజంలో ఉన్న దురాచారాలపై ఆనాడే తన పద్యాలతో సమాజంలో చైతన్యం రగిలించారన్నారు. తెలుగుభాష గొప్పదనాన్ని ప్రపంచానికి చాటిచెప్పారని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిఆర్‌ఒ వెంకటేశ్వర్లు, హౌసింగ్ పిడి చిరంజీవి, ఇంచార్జ్ సిపిఒ భారతి, ఇంచార్జ్ సెట్కూరు సిఇఒ దీప్తి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సాహిత్యమే సమాజ గతి మార్పునకునాంది

సిపిఎం జిల్లా కార్యదర్శి.గౌస్ దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

సాహిత్యమే సమాజ గతిని మార్చ గలదని సిపిఎం జిల్లా కార్యదర్శి డి గౌస్ దేశాయ్ అన్నారు. కర్నూలు నగర పాలక పరిధిలోని 32 వ వార్డు ముజఫర్ నగర్ టి నరసింహయ్య గ్రంథాలయంలో సిపిఎం ఉద్యమ నేత టి.నరసింహయ్య ఆరవ వర్ధంతి సభ గ్రంథాలయ అధ్యక్షులు కె.ప్రభాకర్ అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్య అతిథు లుగా సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్, నరసింహయ్య కుమారుడు హరి, సాహితీ స్రవంతి రాష్ట్ర నాయకులు జంధ్యాల రఘుబాబు మాట్లాడారు. టి. నర్సింహయ్య జీవిత కాలం గ్రంథాలయం,సాహిత్యం సైద్ధాంతిక అవగాహన అభివృద్ధి పైనే ఎక్కువ కృషి చేశారని, ఆ కృషి కారణంగానే కార్యకర్తలు సంఘాల నిర్మాణానికి బలం చేకూ రిందని అన్నారు. గ్రంథాలయం గౌరవ అధ్యక్షులు డాక్టర్ బడే సాహెబ్ మాట్లాడుతూ విజ్ఞానం పంచే గ్రంథాలయాల ద్వారా సాహిత్య అభివృద్ధి జరగడమే నరసింహయ్యకు మనం అందించే నిజమైన నివాళులని అన్నారు. గ్రంథాలయ కార్యదర్శి బి.ఆజాద్, నాయ కులు విజయ్, ధనుష్, పార్టీ నాయకులు జెఎన్.శేషయ్య, సిపిఎం న్యూ సిటీ కార్యదర్శ వర్గ సభ్యులు సుధాకరప్ప, నగర కమిటీ సభ్యులు ఆనంద్, ధనలక్ష్మి ఆటో యూనియన్ నాయకులు హుస్సేన్ వలి, షంషీర్, నబి, శంకరయ్య, శంకర్, బాష, నాగరాజు, సిఐటియు నాయకులు అయ్యస్వామి, సురేష్ మహిళా నాయకులు దానమ్మ, ఈశ్వరమ్మ, నాగేశ్వరమ్మ, అభిమానులు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఎమ్మెల్యే విరుపాక్షిని సన్మానిస్తున్న వైసిపి నాయకులు

అండగా ఉంటాం.. అభివృద్ధి చేసుకుందాం

- ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

వైసిపిపైనా, తనపైనా ఇంత అభిమానం చూపిస్తున్న అందరికీ అండగా ఉంటామని, గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించుకునే బాధ్యత అందరిపైనా ఉందని ఎమ్మెల్యే విరుపాక్షి తెలిపారు. ఆదివారం చిప్పగిరి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హోళగుంద జడ్‌పిటిసి శేషప్ప, వైస్ ఎంపిపి కించప్ప, గజ్జహళ్లి మాజీ సర్పంచి భీమ లింగప్ప, ఇంగాలదహాళ్ ఎంపిటిసి మల్లికార్జున, వైసిపి గజ్జహళ్లి నాయకులు ఎమ్మెల్యే విరుపాక్షిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమాల, శాలువాతో సన్మానించారు. గ్రామాల అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. గ్రామాల్లో ఆ పార్టీ.. ఈ పార్టీ అనే పట్టింపులకు పోకుండా గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా ముందుకు పోదామని తెలిపారు. గ్రామాల్లో ఇప్పటికీ రోడ్ల వసతి, తాగునీటి వసతి సరిగ్గా లేక ప్రజలు, మహిళలు అల్లాడుతున్నారని చెప్పారు. ఎమ్మెల్యే గ్రాంట్ వచ్చిన గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామన్నారు. వైసిపి హోళగుంద ఇన్‌ఛార్జి శ్రీరాములు, ఆంజనేయులు, ఆనంద్, రాజు, రామలింగ, శివలింగ పాల్గొన్నారు.

సామాజిక సేవను అలవర్చుకోవాలి

- టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కృష్ణమ్మ

ప్రజాశక్తి - ఆదోని

వీధులను శుభ్రం చేస్తున్న నాయకులు

సామాజిక సేవలో భాగస్వామ్యం అవుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ తెలిపారు. ఆదివారం ఆదోని మండలం కపటి గ్రామంలో గుడిసె ఆది కృష్ణమ్మ యూత్ ఆధ్వర్యంలో స్వచ్ఛ సేవా కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత చేపట్టారు. ఈ సందర్భంగా గుడిసె ఆది కృష్ణమ్మ చీపురు చేత పట్టి వీధులను శుభ్రం చేశారు. అనంతరం ఆమె మాట్లాడారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటేనే రోగాలు దరిచేరవని సూచించారు. ఆరోగ్యమే మహాభాగ్యమని పెద్దలు అంటుంటారని, ప్రతి ఒక్కరూ ఆ దిశగా పాటుపడాలని తెలిపారు. ఆరోగ్యం బాగుండాలంటే పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని, ఈ నినాదంతో 'మన ఇల్లు.. మన వార్డు.. మన ఊరు.. మన నియోజకవర్గ.. మన రాష్ట్రం.. మన దేశం' అనే నినాదంతో ముందుకు సాగాలని తెలిపారు. గ్రామంలో చెత్తాచెదారం పేరుకుపోయిన వీధులను శుభ్రం చేసి బస్టాండ్‌లో బూజు దులిపి శుభ్రం చేశారు. మాజీ ఎంపిపి భర్త మురళీ, మాజీ సర్పంచి కపటి మాధవ్, సర్పంచి జి.కీర్తి, ప్రశాంత్, ఓంకార్, మహాదేవ, నాగనాథనహళ్లి రవి, రాజశేఖర్, చిరంజీవి, మండిగిరి బాబురావు, దేవేంద్ర, రామకృష్ణ, ముని, వెంకటేష్, పెద్దతుంబలం శ్రీనివాస్, బైచిగేరి రాజు, ఖాసీం, అశోక్, శేఖర్, అంజి, రామాంజి, జగదీష్, తుకారాం, ఈరన్న, రామదాస్, రాజేంద్ర, రాజేష్, పాండు, బసప్ప పాల్గొన్నారు.

రద్దీ సమయంలో ఇబ్బంది కలిగించొద్దు

- ఎస్ఐ పరమేష్ నాయక్

ప్రజాశక్తి - మంత్రాలయం

భక్తుల రద్దీ ఉన్న సమయంలో ఆటోవాలాలు ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించవద్దని ఎస్ఐ పరమేష్ నాయక్ కోరారు. ఆదివారం సిఐ రామాంజులు ఆదేశాల మేరకు ప్రధాన రహదారిలో నెలకొన్న ట్రాఫిక్ సమస్యను సిబ్బందితో కలిసి నియంత్రించారు. రాఘవేంద్రస్వామి దర్శనార్థమై మంత్రాలయం చేరుకున్న భక్తులు తమ వాహనాలను రోడ్డుపై ఉంచడం వల్ల, అటోలు ఇష్టారాజ్యంగా తిరగడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోందని పేర్కొన్నారు. భక్తులు, ఆటోవాలాల నుంచి ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు చేపట్టామని, సరైన రికార్డులు లేని ఆటోల చోదకులకు అపరాధ రుసుం వేసినట్లు తెలిపారు. ట్రాఫిక్ సమస్యను అధిగమించాలంటే బైపాస్ రోడ్డు త్వరగా పూర్తి చేయడమే ఏకైక మార్గమని భక్తులు, ప్రజలు తెలిపారు.

ట్రాఫిక్‌ను నియంత్రిస్తున్న పోలీసులు

రహదారులు అధ్వానం...

● కనకవీడు రోడ్లపై ప్రభుత్వాల చిన్నచూపు ● ఇబ్బంది పడుతున్న రైతులు, ప్రజలు

ప్రజాశక్తి - నందవరం

నందవరం నుంచి గ్రామాలకు రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. కనకవీడు, పొనకలదిన్నె రోడ్లు అధ్వానంగా ఉండడంతో రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నందవరం మండలం కనకవీడు, పొనకలదిన్నె గ్రామాల రోడ్లపై ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయి. కనకవీడు నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. ఈ రోడ్లపై ప్రయాణం చేయాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

కనకవీడు నుంచి పొనగలదిన్నెకు వెళ్లే రహదారి

మండలంలోని చాలా గ్రామాల్లో రహదారులు ఫర్వాలేదనే విధంగా ఉన్నాయి. కనకవీడు గ్రామంలో మాత్రం రోడ్ల దుస్థితి అధ్వానంగా ఉంది. కనకవీడు ప్రాంతంపై ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చిన్నచూపు చూస్తున్నాయని గ్రామస్తులు మండిపడుతున్నారు. నాగలదిన్నె, పేట, మిట్ట సోమపురం గ్రామానికి వెళ్లాలంటే ప్రయాణికులకు రోడ్లపై ఇబ్బందులు పడుతున్నారు. సంవత్సరాలు గడిచినా ప్రభుత్వాలు మాత్రం రోడ్లను బాగు చేయడం లేదు. నాగలదిన్నె పాఠశాలలకు విద్యార్థులు వెళ్లాలన్నా, రైతులు మిల్లులకు వెళ్లాలన్నా రోడ్డు మార్గం ఇబ్బందికరంగా తయారైంది. ఈ రోడ్ల దుస్థితి ఇలా ఉంటే చాలామంది వ్యక్తులు ఇసుక అక్రమ రవాణాకు ఈ మార్గాన్ని అడ్డాగా మార్చుకున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా ట్రాక్టర్‌లో ఇసుకను తరలిస్తూ రోడ్లను మరింత అధ్వానంగా మార్చుతున్నారని గ్రామస్తులు మండిపడుతున్నారు.

కనకవీడు నుంచి నాగలదిన్నె వెళ్లే రహదారి

వర్షమొస్తే ఊరి దగ్గర ఉన్న పొలానికి 20 కిలోమీటర్లు తిరిగి రావాలి

- మేకల వెంకటరాముడు, కనకవీడు గ్రామం



కనకవీడు నుంచి పొనకలదిన్నె గ్రామానికి వెళ్లే రహదారి మోకాళ్ల లోతు గుంతలతో, రాళ్లతో ఉంది. వర్షాకాలంలో వర్షం కురిస్తే వాగులో నీరు నిండి ప్రజలు పొలానికి వెళ్లలేని స్థితి ఏర్పడుతుంది. గ్రామానికి ఒక కిలోమీటర్ దూరంలో మా పొలాలు ఉన్నాయి. వర్షాకాలంలో ఆ పొలాలకు వెళ్లాలంటే సుమారు 20 కిలోమీటర్లు వేరే మార్గంలో వెళ్లి పొలం పనులు చూసుకుని రావాల్సి వస్తోంది. వర్షం కురిస్తే రోడ్డు మొత్తం కొట్టుకుపోతుంది. గ్రామస్తులందరూ కలిసి జెసిబి సహాయంతో ప్రతేడాది ఆ రోడ్డును మట్టితో నిర్మించుకుంటారు.

గ్రామాల మధ్య సత్సంబంధాలు అభివృద్ధి చెందడం లేదు

- తలారి నరసింహులు, కనకవీడు గ్రామం



కనకవీడు, పొనకలదిన్నె వెళ్లే రహదారి 2009లో సంభవించిన వరదల్లో పూర్తిగా కొట్టుకుపోయింది. అప్పటి నుంచి ఇప్పటివరకు రెండు గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం లేక సత్సంబంధాలు అభివృద్ధి చెందడం లేదు. రైతులు, ఎద్దుల బండ్లు పొలానికి వెళ్లటానికి ఇబ్బందిగా ఉంది. నందవరం గ్రామానికి పొనకలదిన్నె గ్రామస్తులు ఈ మార్గం నుంచి వెళ్తే 12 కిలోమీటర్లు అవుతుంది. ఈ రోడ్డు మార్గం సరిగా లేకపోవడం వల్ల ఎమ్మిగనూరుపైన 26 కిలోమీటర్లు ప్రయాణించి నందవరం గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది.

తల్లిదండ్రులతో ఉన్న బాలుడు

తప్పిపోయిన బాలుడు క్షేమం

- 24 గంటల్లో కిడ్నాప్ కేసును ఛేదించిన పోలీసులు

- తల్లిదండ్రులకు బాలుని అప్పగింత

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు పట్టణంలో శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతరకు వచ్చిన కొందరు వ్యక్తులు బాలుని కిడ్నాప్ చేసిన విషయం విదితమే. కిడ్నాప్‌కు గురైన ఎమ్మిగనూరు పట్టణానికి చెందిన ఐదేళ్ల బోయ చరణ్ క్షేమంగా ఇంటికి చేరాడు. చరణ్ తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. ఆదివారం పట్టణ సిఐ శ్రీనివాసులు తప్పిపోయిన బాలుడు చరణ్‌ను పట్టణ పోలీసు స్టేషన్‌లో తల్లిదండ్రులకు అప్పగించారు. పట్టణ సిఐ శ్రీనివాసులు వివరాల మేరకు... ఎమ్మిగనూరు పట్టణంలోని హనుమాన్ నగర్‌కు చెందిన బోయ రామాంజి, బోయ నాగవేణి దంపతులకు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఈనెల 18న వాల్మీకి చరణ్ తప్పిపోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్పీ బిందు మాధవ్, డీఎస్పీ ఉపేంద్ర బాబు ఆదేశాల మేరకు 5 ప్రతేక బృందాలుగా ఏర్పడి 24 గంటల్లో బాలుని ఆచూకీ గుర్తించారు. పోలీసులు, మీడియా, ప్రజల సహకారంతో సిసి పుటేజీ ఆధారంగా కిడ్నాప్ కేసును ఛేదించాం. సెల్ ఫోన్ చూపించి బాలుని ఎత్తుకెళ్లిన వారిని గుర్తిస్తున్నామని తెలిపారు.

వివాహ వేడుకల్లో సీతారామిరెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీలో జరిగిన రెండు వివాహ వేడుకలకు వైసిపి నాయకులు, టిటిడి పాలకమండలి మాజీ సభ్యులు వై.సీతారామిరెడ్డి హాజరయ్యారు. ఆదివారం స్థానిక ముస్లిం, మైనార్టీ నాయకులు ఖాజా సోదరి నూర్జహాన్, పింగాణి ఖాజా కుమారుడు ముస్తక్‌ల వివాహ వేడుకకు హాజరయి వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. పెళ్లి పెద్దలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సీతారామిరెడ్డిని, సర్పంచి తెల్లబండ్ల భీమయ్యను శాలువాలతో సన్మానించారు. గంగపుత్రుల సంఘం అధ్యక్షులు హండే శాంతయ్య, సాంబ సదాశివగౌడు, బంగి భీమయ్య, మిడిగెలదిన్నె నరసింహ, చంద్ర, మైనార్టీ నాయకులు సాబువలీ, రఫీ, అక్బర్ ఉన్నారు.

వేడుకల్లో పాల్గొన్న సీతారామిరెడ్డి

ఉపాధి పనులు కల్పించాలి

- సిపిఎం

ప్రజాశక్తి - ఆస్పరి

ఉపాధి హామీ పనులు కల్పించి వలసలను నివారించాలని సిపిఎం మండల కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి పనులేక తెలంగాణ, రాయచూర్, గుంటూరు, కడప, బెంగళూరు వంటి సుదూర ప్రాంతాలకు వలస వెళ్తున్నారని తెలిపారు. 100 రోజుల పని దినాలు పూర్తయిన కుటుంబానికి అదనంగా వంద రోజులు పని కల్పించాలని కోరారు. రోజువారీ కూలి రూ.600 ఇవ్వాలని, పని ప్రదేశంలో మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. పని ప్రదేశంలో ప్రమాదవశాత్తు చనిపోయిన వారికి రూ.5 లక్షలు అందించాలని, గతంలో మాదిరి ప్రభుత్వమే డిమాండ్స్ పేపర్లు ఇవ్వాలని తెలిపారు. శ్రమశక్తి సంఘాల మేటీలకు రూ.5 పారితోషకం ఇవ్వాలన్నారు. లేకపోతే ఉపాధి కూలీలతో కలిసి పెద్దఎత్తున ఆందోళనకు పూనుకుంటామని హెచ్చరించారు. ఈనెల 23న ఆదోనిలో జరిగే సదస్సులో ఉపాధి కూలీలు, రైతులు, ప్రజలు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

అమిత్ షా 'గోబ్యాక్'

- వామపక్షాల నిరసన

ప్రజాశక్తి - ఆదోని

కేంద్ర హోమ్ మంత్రి అమిత్ షా 'గో బ్యాక్' అంటూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఆదివారం ఆదోని మున్సిపల్ మైదానం నుంచి బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం వరకు ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కె.వెంకటేశులు, సీనియర్ నాయకులు ఈరన్న, సిపిఐ రాష్ట్ర నాయకులు అజయ్ బాబు, లక్ష్మి రెడ్డి మాట్లాడారు. రాజ్యసభలో అంబేద్కర్ పట్ల అవమానకరంగా వ్యాఖ్యలు చేసిన అమిత్ షా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాంటి వ్యక్తికి రాష్ట్ర ప్రభుత్వం ఆతిథ్యం ఇవ్వడం సిగ్గుచేటన్నారు. రాష్ట్ర అభివృద్ధికి నిధులు రాబట్టాల్సిన కూటమి నాయకులు మోడీ, అమిత్ షా జపం చేస్తున్నారని మండిపడ్డారు. బాధ్యతయుతమైన పదవిలో ఉన్న వ్యక్తుల పట్ల, గౌరవప్రదమైన వారి పట్ల అవమానకరంగా మాట్లాడడం తగదని తెలిపారు. మనువాద భావాలు కలిగిన వ్యక్తులు దేశ నాయకుల పట్ల అనుచితంగా మాట్లాడడం పరిపాటిగా మారిందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకిక దేశమైన భారతదేశంలో ఒకే మతం ఉండాలన్నదే మోడీ, అమిత్ షా ఉద్దేశమని, వారి ఎత్తుగడలను ప్రతి ఒక్కరూ తిప్పుకొట్టాలని కోరారు. అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన అమిత్ షాను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, నాయకులు పిఎస్.గోపాల్, తిప్పన్న, వీరేష్, వెంకటేష్, నాగేంద్ర, నాగరాజు, సిఐటియు మండల కార్యదర్శి వీరారెడ్డి, వ్యకాస మండల అధ్యక్షులు రామాంజనేయులు, సిపిఐ నాయకులు కల్లుబావి రాజు, బసాపురం గోపాల్, హుస్సేని, వెంకన్న, విజయ్, సిపిఐ (ఎంఎల్) నాయకులు వెంకప్ప, విద్యార్థి సంఘాల నాయకులు శ్రీనివాసులు, లింగన్న, ఉదయ్ ఉన్నారు.

ఆలూరు గెస్ట్ హౌస్ నుంచి సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో ర్యాలీగా బయల్దేరి నినాదాలు చేస్తూ అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేపట్టారు. సిపిఎం మండల నాయకులు మైనా అధ్యక్షత వహించారు. సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పి.హనుమంతు, సిపిఐ జిల్లా సమితి సభ్యులు కె.భూపేష్, సిపిఎం ఆలూరు ప్రాంతీయ నాయకులు ఎస్.వెంకటేశ్వర్లు, కృష్ణ, సీనియర్ నాయకులు ఈశ్వర్ గౌడ్, విఠల్, ఆటో యూనియన్ నాయకులు సద్దాం, శివ, నాగరాజు, సూరి, సిపిఐ నాయకులు బాష, గోపాల్, సిద్ధ లింగ పాల్గొన్నారు.

ఆదోనిలో ప్రదర్శన నిర్వహిస్తున్న వామపక్ష నాయకులు

ఆలూరు అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన చేస్తున్న వామపక్ష నాయకులు

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- సిడిపిఒ ఉమామహేశ్వరి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో ఆదోని ఐసిడిఎస్ ప్రాజెక్ట్ పరిధిలో అంగన్వాడీ ఆయాల నియామకానికి అర్హులైన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ ఉమామహేశ్వరి తెలిపారు. ఆదివారం ఆమె మాట్లాడారు. 12 అంగన్వాడీ ఆయాల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. హవన్నపేట (సెంటర్ 1) - (ఈడబ్ల్యుఎస్), సుల్తానపురం (ఓసీ), పాండవగల్ (బీసీ-ఎ), బోయగేరి (సెంటర్ 2) - (ఓసీ), కుప్పగళ్ (సెంటర్ 3) - (ఓసీ), పెద్దతుంబలం (సెంటర్ 3) - (ఈడబ్ల్యుఎస్), మదిరే (సెంటర్ 2) - (ఎస్టీ), పెద్దహరివానం (సెంటర్ 8) - (ఓసీ), సాదాపురం (సెంటర్ 2) - (బీసీ-బి), ఆరెకల్ (సెంటర్ 2) - (ఓసీ), నిజాముద్దీన్ కాలనీ (సెంటర్ 1) - (ఓసీ), హవన్నపేట (సెంటర్ 2) - (ఓసీ) భర్తీ చేయనున్నట్లు చెప్పారు.

ఆయాల పోస్టులకు కావాల్సిన అర్హతలు

అర్బన్ అంగన్వాడీ కేంద్రానికి అభ్యర్థి తప్పని సరిగా 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. గ్రామంలో గల అంగన్వాడీ కేంద్రానికి తప్పనిసరిగా 7వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అంతకన్నా ఎక్కువ విద్యార్హత ఉన్న వారికి ప్రాధ్యానత ఇస్తాం. అభ్యర్థినులు జులై 1, 2024 నాటికి 21 ఏళ్లు నిండి 35 ఏళ్లలోపు వారై ఉండాలి. అభ్యర్థినులు తప్పనిసరిగా వివాహితులై ఉండి స్థానిక నివాసితులై ఉండాలి. (అదే వార్డు, గ్రామానికి చెందినవారై ఉండాలి) ఎస్సీ, ఎస్టీ అభ్యర్థినులు 21 ఏళ్లు నిండిన వారు లేకపోతే 18 ఏళ్లు నిండిన వారిని పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

జతపరచాల్సిన ధ్రువపత్రాలు

పుట్టిన తేదీ/వయస్సు ధ్రువీకరణ పత్రం, కుల ధ్రువీకరణ పత్రం, విద్యార్హత ధ్రువీకరణ పత్రం. ఎస్సీ, ఎస్టీ మార్క్ లిస్ట్, టీసీ, ఎస్ఎస్‌సిలోపు చదివిన వారు 10వ తరగతి మార్క్ లిస్ట్, టీసీ జతపరచాలి. నివాస స్థల ధ్రువీకరణ పత్రం, వితంతువు అయితే భర్త మరణ ధ్రువీకరణ పత్రం, వికలాంగులు అయితే పిహెచ్ సర్టిఫికేట్, వితంతువు అయితే 18 ఏళ్ల పిల్లలుంటే పిల్లల వయసు ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్ దరఖాస్తు వెంట ధ్రువ పత్రాలు జిరాక్స్ కాపీలను జతపరచి సంబంధిత సిడిపిఒ కార్యాలయానికి ఈనెల 20 నుంచి ఈనెల 28 సాయంత్రం 5 గంటల్లోపు సమర్పించాలని తెలిపారు.

విద్యాలయాల్లో కీచక పర్వం

- ఇబ్బందులు పడుతున్న బాలికలు

ప్రజాశక్తి - ఆదోని

బాలికల విద్యాలయాల్లో కీచక పర్వం కొనసాగుతూనే ఉంది. విద్యాబుద్ధులు నేర్పి ప్రయోజకులుగా తీర్చిదిద్దాల్సిన కొందరు ఇలాంటి కీచక బుద్ధికి తెర లేపుతున్నారు. ఇటీవల బనవాసి గురుకుల విద్యాలయంలో అమ్మాయిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. ఆ ఘటన మరువకముందే ఆదోని పట్టణంలో ప్రభుత్వ బాలికల కళాశాలలో కొనసాగుతున్నట్లు వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన సోషల్ మీడియా వేదికగా చక్కర్లు కొడుతోంది. ఈ ఘటనకు పాల్పడిన వారి పట్ల కఠినంగా వ్యవహరించాలని ప్రజలు కోరుతున్నారు. యుక్త వయస్సులో ఉన్న వారికి మంచి, చెడు నేర్పడంలో తల్లిదండ్రులు కన్నా గురువులు చెబితే వింటారన్నది అందరికీ తెలిసిన విషయమే. విద్యాబుద్ధులు నేర్పాల్సిన ఓ గురువు అమ్మాయిలపై చేతులు వేయడం, తాకడం లాంటి వికార చేష్టలకు పాల్పడుతున్నారని విద్యార్థినులు వాపోతున్నారు. వారి వ్యక్తిగత విషయాలు తెలుసుకుంటూ, ఆర్థిక అవసరతలను పసిగట్టడం, కావాల్సిన నగదు ఇస్తామని ఆశ చూపడం వంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు విద్యార్థినులు చెబుతున్నారు. వారి సమస్యలను విని పరిష్కరించాల్సిన వారే అలాంటి కీచక చేష్టలకు పాల్పడే వారికి వత్తాసు పలుకుతున్నారని, తమ ఆవేదన ఎవరికి చెప్పుకోవాలని వాపోతున్నారు. ఆదోని పట్టణ ప్రభుత్వ బాలిక కళాశాల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన లెక్చరర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

ఘటనపై విచారణ చేపట్టాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాసులు

పట్టణంలో ఉన్న ప్రభుత్వ బాలిక కళాశాలలో చదువుతున్న విద్యార్థినుల పట్ల ఓ లెక్చరర్ అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినులు బహిరంగంగా చెబుతున్నారు. తరగతి గదిలో పాఠాలు బోధించకుండా అమ్మాయిల పర్సనల్ విషయాలు చర్చిస్తూ వారిని తాకడం, చనువుగా మెలుగుతూ అసభ్యంగా వ్యవహరిస్తున్నారని విద్యార్థినులు మా దృష్టికి తెచ్చారు. ఎక్కడపడితే అక్కడ తాకడం వల్ల విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. లెక్చరర్‌పై తక్షణమే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలి. ఈ విషయంపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం. ఆదోని పట్టణ ప్రభుత్వ బాలిక కళాశాల విద్యార్థినులకు ఎస్ఎఫ్ఐగా అండగా ఉంటాం. సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళనకు మద్దతు ఇస్తాం.

మాట్లాడుతున్న టిడిపి నాయకులు

వెంకటేష్ సేవలను గుర్తించాలి

- మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలి

- టిడిపి ఐనేకల్లు నాయకులు

ప్రజాశక్తి - ఆస్పరి

పార్టీ అభివృద్ధి కోసం పని చేసిన బిల్లేకల్లు తలారి వెంకటేష్‌ను అధిష్టానం గుర్తించి ఆలూరు మార్కెట్ యార్డు ఛైర్మన్ పదవి ఇవ్వాలని టిడిపి ఐనేకల్లు నాయకులు ఉరుకుంద, ఎర్రిస్వామి, మల్లన్న, వీరేష్, విక్రమ్, అట్టేకల్లు రాజశేఖర్ కోరారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడారు. బిల్లేకల్లు వెంకటేష్ ఆస్పరి మండలంలో టిడిపి అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారన్నారు. సామాజిక సేవా కార్యక్రమాలతో రాజకీయాల్లోకి వచ్చి ఎన్నో పదవులు చేపట్టారని తెలిపారు. 2006లో ఎంపిపి జనరల్‌కు కేటాయించగా ఎస్సీ కోటాలో ఎంపిపి పదవిని చేజిక్కించుకోవడం ఆయన రాజకీయ చాణిక్యతకు నిదర్శనమని చెప్పారు. 2012 నుంచి 2021 వరకు టిడిపి మండల కన్వీనర్‌గా పని చేశారన్నారు. 2013 నుంచి 2018 వరకు వెంకటేష్ భార్య తలారి సంజమ్మ సర్పంచిగా పని చేశారని తెలిపారు. వైసిపి అధికారంలో ఉన్నప్పుడు ఆయనపై కక్ష కట్టి అక్రమ కేసులు బనాయించి రెండుసార్లు జైలుకు పంపారని చెప్పారు. బిల్లేకల్లు గ్రామంలో మార్కెట్ యార్డు ఏర్పాటుకు ఎంతో కృషి చేశారన్నారు. అలారుదిన్నె నుంచి 7 కిలోమీటర్లు పైపులైను ఏర్పాటు చేసి బిల్లేకల్లు, అట్టేకల్లు గ్రామాలకు తాగునీటి వసతి కల్పించారని తెలిపారు. 1999 నుంచి నేటి వరకు పార్టీలో కొనసాగుతూ ఎన్నో పదవులు చేపట్టారని చెప్పారు. ప్రస్తుతం ఆయన పార్టీ జిల్లా సెక్రటరీగా పని చేస్తున్నారన్నారు.

పశువైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోండి

- పశు వైద్యాధికారి జగదీష్

ప్రజాశక్తి - కౌతాళం

పాడి రైతుల కోసం నిర్వహిస్తున్న పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యాధికారి జగదీష్ బాబు, బదినేహాల్ వైద్యాధికారిని మహేశ్వరి కోరారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలంలో విడతలవారీగా అన్ని గ్రామాల్లోనూ పశు వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సోమవారం కామవరం, కౌతాళంలో పశు వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని తెలిపారు. గ్రామ పాడి రైతులు, పశు యజమానులు పశువులకు టీకాలు, గర్భకోశ వ్యాధులు, అనారోగ్య సమస్యలు, గొర్రెలకు, దూడలకు నట్టల నివారణ మందులు వేయించాలని సూచించారు. పశువుల యజమానులు ఈ పశు వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రవికి బసవరాజు పరామర్శ

ప్రజాశక్తి - కౌతాళం

టిడిపి కార్యకర్త అద్దాల రవిని టిడిపి నాయకుడు, మాజీ ఎంపిటిసి చౌదరి బసవరాజు పరామర్శించారు. ఆదివారం కర్నూలులోని ఓ ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రవి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, త్వరగా కోలుకోవాలని ఆశిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రవిని పరామర్శిస్తున్న బసవరాజు

ముగిసిన ఎద్దుల బండలాగుడు పోటీలు

- సీనియర్ విభాగంలో నారాయణపురం ఎద్దులు విజయం

- బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఒంగోలు ఎద్దుల బండ లాగుడు పోటీలు ఆదివారం ముగిశాయి. స్థానిక వీవర్స్ కాలనీ గ్రౌండ్‌లో 4వ రోజు సీనియర్ విభాగంలో ఎద్దుల బండ లాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. సీనియర్ విభాగంలో అనంతపురం జిల్లా ఎ.నారాయణపురం గ్రామానికి చెందిన షేక్ మహ్మద్ ఖదీర్ వృషభాలు మొదటి బహుమతి రూ.లక్ష గెలుచుకున్నాయి. రెండో బహుమతి నంద్యాల జిల్లా డోన్ మండలం ధర్మవరం గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి ఎద్దులు గెలుచుకున్నాయి. మూడో బహుమతి కడప జిల్లా ప్రొద్దుటూరు మండలం చౌటుపల్లికి చెందిన మర్తల చంద్ర ఓబుల రెడ్డి ఎద్దులు గెలుచుకున్నాయి. నాలుగో బహుమతి అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన కె.రామాంజనేయులు, ఐదో బహుమతి కడప జిల్లా ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీకి చెందిన డి.గుర్వి రెడ్డి వృషభాలు గెలుపొందాయి. బహుమతులను నిర్వాహకులు అందజేశారు. టిడిపి నాయకులు, నిర్వాహకులు ప్రతాప్, ఉరుకుందయ్య శెట్టి, ముగతి ఈరన్న గౌడ్, ఖాసీం వలీ, రైస్ మిల్ నారాయణ రెడ్డి, రాళ్లదొడ్డి మురళీ కృష్ణా రెడ్డి, విరుపాక్షి రెడ్డి, పార్లపల్లి చంద్రశేఖర్ రెడ్డి, సోగనూరు బోయ జగదీష్, భాస్కర్, రామదాస్ గౌడ్, కొండన్న గౌడ్, మహేంద్ర, నరసింహ రావు, బందే నవాజ్, కమీషన్ ఏజెంట్స్ జగన్నాథ రెడ్డి, అనిల్, బాబు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న నాయకులు

వ్యవసాయ మార్కెట్ కమిటీ, కర్నూలు

ఆర్.ఓ.సి.నెం. 72/2024 తేది : 18.01.2025

టెండర్ నోటీసు

కర్నూలు మార్కెట్ యార్డును ప్రతి దినము శుభ్రపరుచుట, కాలువలను శుభ్రపరుచుట, వ్యర్థ పదార్థాలను డంప్ యార్డుకు తరలించుటకుగాను టెండర్ ఐడి నెం.780259 ద్వారా ఆన్‌లైన్ టెండర్‌ను ఆహ్వానించడమైనది. మరింత సమాచారము కొరకు www.apeprocurement.gov.in వెబ్‌సైట్ నందు పొందగలరు. టెండర్ దాఖలు వేయు చివరి తేది: 27.01.2025 సాయంత్రం 4.30 గంటలకు.

వేలము నోటీసు

ఆర్.ఓ.సి.నెం. 112/2022 తేది : 18.01.2025

కర్నూలు మార్కెట్ యార్డు వెలుపల ఖాళీగా ఉన్న వాణిజ్య దుకాణములను వేలము ఐడి.24919 ద్వారా ఆన్‌లైన్ వేలము నిర్వహించబడును. మరింత సమాచారము కొరకు www.konugolu.ap.gov.in వెబ్‌సైట్ నందు పొందగలరు. వేలము ధాఖలు చేయు చివరి తేది: 31.01.2025 సాయంత్రం 4.30 గంటలకు.

శ్రీ సి.రామాంజనేయులు, పర్సన్-ఇన్‌చార్జి

శ్రీమతి ఆర్.జయలక్ష్మి ఎంపిక శ్రేణి కార్యదర్శి